క్లుప్తంగా

నేటి నుంచి శిక్షణ తరగతులు

బచ్చన్నపేట/తరిగొప్పుల : అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జీపీ కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని బచ్చన్నపేట, తరిగొప్పుల ఎంపీడీఓలు మల్లికార్జున్, ఆలేటి దేవేందర్ సోమవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారితో జీపీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో 4 రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

దయాకర్‌కు డాక్టరేట్

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లికి చెందిన సామాజిక సేవకుడు చిట్యాల దయాకర్‌కు హైదరాబాదులో స్ఫూర్తి సోషల్ సర్వీస్ సొసైటీ, ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఐఏఓ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. సొసైటీ ముఖ్య సలహాదారులు చెన్నారెడ్డి, రమేష్, కన్నడ సినీనటుడు అశోక్ షేక్ హుస్సేన్ పర్వీన్, నాగస్వామి చేతుల మీదుగా ఆదివారం రాత్రి డాక్టరేట్ పట్టాను దయాకర్‌కు అందజేశారు.

పద్మశాలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

రఘునాథపల్లి: అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పద్మశాలీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆ సంఘం జిల్లా నాయకుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాపోలు రామ్మూర్తి సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖను కలిసి విజ్ఞప్తి చేశారు. పద్మశాలీ చేనేత కార్మికులు ఆకలి, అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని రామ్మూర్తి తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తరిగొప్పుల: చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.నాగేశ్వరచారి సూచించారు. మండలకేంద్రం గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ గుజ్జు రవీందర్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఎస్‌ఎం వసంతరాణి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

లింగాలఘణపురం: మండలంలోని కుందారం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం స్థానిక ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఆర్థిక సాయంతో రూ.35వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులను ఎంఈఓ విష్ణుమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు సొంత డబ్బులతో దుస్తులు అందజేసిన ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని అభినందించారు.

హెచ్‌ఎంకు సన్మానం

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సరోజనను సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి పెళ్లి హరిప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం తదితర కార్యక్రమాల ద్వారా ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికవడంపై సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తాం..

చిల్పూరు: తమపై నమ్మకంతో గౌడ సంఘానికి ఎన్నుకున్నందున గౌడ సంఘం కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన బాధ్యులు కోరుకొప్పుల ఇంద్రసేనగౌడ్, నకరకంటి నర్సయ్యలు తెలిపారు. మండలంలోని నష్కల్‌లో సోమవారం గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో రాజు, కొంరయ్య, రమేష్, డిష్ రాజు, వేమన, రాజయ్య ఎన్నికయ్యారు. దీంతోపాటు ఎల్లమ్మ గుడి చైర్మన్‌గా మోడెం భిక్షపతి ఎన్నికయ్యారు.

హాజరుశాతం పెంచాలి

జనగామ రూరల్: విద్యార్థుల హాజరు శాతం పెంచి వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఆర్టీ ప్రతినిధి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలలో ఐఎఫ్‌బీ పని తీరు, నాస్ పరీక్షలపై విద్యార్థులను పరిశీలించి వాటిపై అవగాహన కల్పించారు.

పాఠశాలలో క్లబ్‌ల ఏర్పాటు

జనగామ రూరల్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం పెంబర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ జి.నాగరాణి ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సిహెచ్.రాధిక ఆధ్వర్యంలో విద్యార్థులకు క్లబ్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన క్లబ్, సాంస్కృతిక కార్యక్రమాల, పర్యావరణ పరిరక్షణ, ప్రహారీ క్లబ్, ఎన్‌జీసీ, క్రీడల, పరిసరాల పరిశుభ్రత క్లబ్, వ్యక్తిగత పరిశుభ్రత క్లబ్ ఏర్పాటు చేశారు. ప్రతీ క్లబ్‌కి లీడర్ 1, లీడర్ 2 చొప్పున ఎంపిక చేయడం జరిగింది.

ఒకేచోట పది మంది విగ్రహాలు

- వీటిలో జాతీయ నేతలు.. ఉద్యమకారులు
- మహనీయుల స్మరణలకు నిలయంగా 'లింగాలఘణపురం'



తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ముందు ఐలమ్మ,కొంరయ్య, సర్వాయి పాపన్న, లక్ష్మారెడ్డి విగ్రహాలు

లింగాలఘణపురం : జిల్లాలో ఎక్కడ లేనివిధంగా మండల కేంద్రంలో పది మంది జాతీయ మహానేతలు, ఉద్యమకారుల విగ్రహాలతో మహనీయుల స్మరణలకు నిలయంగా లింగాలఘణపురం నిలిచింది. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద, మాజీ ప్రధాని వాజ్‌పేయితో పాటు భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొంరయ్య, బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ సర్వాయిపాపన్న, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు మండల ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించిన అప్పటి మాజీ ఎమ్మెల్యే రొండ్ల లక్ష్మారెడ్డి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఆయా నేతల జయంతి వర్ధంతి వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. 1989లోనే గాంధీ విగ్రహం 12వ వార్డులో ఏర్పాటు చేయగా 2012లో తెలంగాణ తల్లి విగ్రహం పాలకేంద్రం వద్ద, జిల్లాలో మొదటిసారి లింగాలఘణపురంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అప్పటి నాయకుడు, ప్రస్తుత ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. 2015లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య ఆవిష్కరించారు. 2016లో స్వామి వివేకానంద విగ్రహాన్ని పూర్వవిద్యార్థులు ఆత్మీయ మహాసమ్మేళనం సందర్భంగా ఉన్నత పాఠశాల ఎదురుగా ఆవిష్కరణ జరిగింది. అదేవిధంగా పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్, దొడ్డి కొంరయ్య విగ్రహాన్ని ఐలమ్మ విగ్రహం పక్కనే మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా 2017లో ఆవిష్కరించారు. 2023లో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఎమ్మెల్యే హోదాలో ఈటల రాజేందర్ గ్రామ ప్రవేశంలోనే ప్రారంభించారు. మండల ఏర్పాటులో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విగ్రహాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అరవింద్‌రెడ్డి 2023లో ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఆవిష్కరించారు. అలాగూ ఈ నెల 29న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. పది గ్రామాల్లో అంబేడ్కర్, మూడు గ్రామాల్లో గాంధీ విగ్రహాలను ఏర్పా టు చేశారు.

'బతుకమ్మ'కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



బతుకమ్మ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎంగిలిపూల, సద్దుల బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని ఘన్‌పూర్‌లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఘన్‌పూర్‌లోని హనుమాన్‌గుడి వద్ద చెరువు కట్ట సమీపాన మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. బతుకమ్మ ఆట ఆడే ప్రదేశాన్ని, అక్కడ ఉన్న బతుకమ్మ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ తగిన సూచనలు అందించారు. బతుకమ్మ ఆడే ప్రదేశానికి పాత గాంధీ చౌరస్తా వద్ద నుంచి, ముదిరాజ్‌కాలనీ నుంచి, బొడ్రాయి కాలనీ నుంచి మహిళలు అధిక సంఖ్యలో వస్తారని, ఆయా రోడ్లను మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశంలో లైటింగ్, కట్ట ఎక్కడానికి మెట్లు చెక్కడం, బతుకమ్మ విగ్రహానికి పెయింటింగ్, గ్రానైట్ తదితర పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులతో పనులు చేయించాలని, అవసరమైతే సీడీఎఫ్‌నిధులు అందిస్తానని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, బతుకమ్మ పండుగ ప్రశాంతంగా, దిగ్విజయంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, ఎంపీడీఓ విజయశ్రీ, ఆర్‌ఐ రవీందర్, కార్యదర్శి చుక్క లింగయ్య, నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, నీల గట్టయ్య, నర్సింహులు, ఐలయ్య, సారయ్య, వెంకటయ్య, ఇంద్రారెడ్డి, రాజు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధి పొందాలి

యువత ఎవరో ఏదో చేస్తారని ఆశించకుండా తమకు నచ్చిన రంగంలో ముందుకు వెళ్తూ స్వయం ఉపాధి పొందాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లో కనకం సుధాకర్‌కు చెందిన సుధాశ్రీ ఆర్ట్స్ రేడియం, గిఫ్ట్ షాపును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నచ్చిన రంగంలో రాణిస్తూ స్వయం ఉపాధి పొందడంతో పాటు పదిమందికి ఉపాధి కల్పించాలని ఆయన సూచించారు.

పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలి

- సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రాజా

పాలకుర్తి : అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు ఉపయోగిస్తున్న హైడ్రా లాంటి వ్యవస్థను గ్రామస్థాయిలో అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. సోమవారం పాలకుర్తిలో పార్టీ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎలాంటి అనుతులు లేకుండా కబ్జా చేసిన కట్టడాలను చట్టపరమైన చర్యలతో కూల్చివేయడం ప్రభుత్వ సరైన చర్యగా ఆయన అన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు, భూకబ్జాదారులు, పెట్టుబడిదారులు చెరువులు, కుంటల భూములను ఆక్రమించి తమ అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని అన్నారు. అక్రమ భూములతో కోట్లాది రూపాయలకు పడగలెత్తిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

లిబరేషన్‌లో చేరిక

లిబరేషన్ పార్టీలో తూర్పాటి సారయ్య, గాయాల బాబు చేరారు. పార్టీ జిల్లా నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, జీడి సోమయ్య, సోమయ్య, కొనకటి కళింగరాజులు పాలొంగరాజులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే చేయూత



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్‌కు చెందిన పేద కుటుంబానికి చెందిన కుసుమ రాజు–స్వప్నల కూతురు శ్రీవల్లి ఆర్థికస్తోమత లేక ఇంజనీరింగ్ చదవడానికి ఇబ్బందులు పడుతోంది. విషయాన్ని కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, ఎడవెల్లి మల్లారెడ్డిలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్రీవల్లి చదువుకు అవసరమైన కళాశాల ఫీజును కడియం ఫౌండేషన్ ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గతంలో బీటెక్ మొదటి సంవత్సరం ఫీజు రూ. 35 వేల నగదును విద్యార్థికి అందజేశారు.

కళాశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు



స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు



కొడకండ్ల : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎంగిలిపూల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆట ఆడగా సందడి నెలకొంది. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.కమలాకర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో

డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులు సోమవారం బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. హెచ్‌డబ్ల్యూఓ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

కొడకండ్ల : స్థానిక టీజీఆర్ఎస్‌జేసీ బాలికల గురుకులంలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బుధవారం నుంచి సెలవుల నేపథ్యంలో గురుకులంలో తంగేడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మలను పేర్చుకొని మహిళా అధ్యాపకులతో కలిసి విద్యార్థినులు ఆటపాటలతో బతుకమ్మలను ఆడారు.

ప్రజావాణికి స్పందన కరువు

నర్మెట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజాస్పందన కరువైంది. గతంలో జిల్లా కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు మాసం నుంచి ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఆగస్టు 5న తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించగా కేవలం 9 దరఖాస్తులు వచ్చాయి. కాగా 6 వారాల పాటు నిలిచిపోయిన కార్యక్రమం తిరిగి సెప్టెంబర్ 23, 30న నిర్వహించగా ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక్క ఫిర్యాదు సైతం రాలేదని తహసీల్దార్ వెంకట రామానుజాచార్యులు, డీటీ కురికాల వేణు తెలిపారు.

తరిగొప్పుల : గత రెండు వారాలుగా తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా కేవలం భూ సమస్యలకు సంబంధించి మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మండలవ్యాప్తంగా భూ సమస్యలు, రేషన్ కార్డు, ఇంటి స్థలాలకు సంబంధించి చాలా సమస్యలు ఉన్నప్పటికీ ఏ ఒక్కరూ దరఖాస్తులు చేసుకోలేదంటే ప్రజావాణిపై ప్రజలకు అవగాహన లేకపోవడమే కారణమని స్పష్టమవుతుంది.

దేవరుప్పుల : గత కొన్నేళ్లుగా కలెక్టరేట్‌లో ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువతో అత్యధికంగా తహసీల్దార్ పర్యవేక్షణలో పరిష్కారం చూపాల్సిన ఆవశ్యకతను ఉన్నతాధికారులు గుర్తించిన విషయం విదితమే. ఈ మేరకు చేపడుతున్న ప్రజావాణికి స్థానిక అధికారులకు ఎవరూ దరఖాస్తులు చేయకపోవడం గమనార్హం.

దరఖాస్తుల పరిష్కారానికి కృషి

బచ్చన్నపేట: డిప్యూటీ తహసీల్దార్ అధ్యక్షతన సోమవారం తహసీల్దార్ కార్యాలయలంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ ఫణి కిషోర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఆరు దరఖాస్తుల రాగా అందులో భూ సమస్యలకు సంబంధించి 5, ఇంటి స్థలానికి సంబంధించి 1 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఏఆర్ రెహమాన్, పాల్గొన్నారు.

భూమి నమోదులో తప్పులు సరిచేయాలి

పాలకుర్తి: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తహసీల్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌కు ముగ్గురు బాధిత రైతులు తమ దరఖాస్తులను అప్పగించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో తిర్మలగిరికి చెందిన కాసోజు సోమయ్య, ముత్తారం గ్రామానికి చెందిన కునుసోతు బుజ్జమ్మ, చెన్నూరుకు చెందిన పండుగ నర్సయ్యలు తమ దరఖాస్తులను సమర్పించారు. తమ పట్టా భూముల్లో సరిగా నమోదు కాలేదని అన్నారు. దీంతో తమకు పూర్తిగా నష్టం జరుగుతుందని అన్నారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారికి సత్కారం



జనగామ: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యాంసాని రాధాకిషన్‌ను సోమవారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా తొలి అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్ర గుప్త సత్కరించారు. ఆయన వెంట సభ మాజీ ఉపాధ్యక్షుడు గజ్జల శ్రీశైలం, మాజీ కార్యదర్శి గౌరిశెట్టి బాలలింగం, వంశీ, లక్ష్మణ్, అభిషేక్, లఖాన్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నర్మెట: సైబర్ క్రైం, మూఢనమ్మకాలు, మాదకద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నైనాల నగేష్ అన్నారు. మండలంలోని వెల్దండలో పోలీస్ కళాజాగృతి బృందం వారిచే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డయల్ 100ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గంజాయి, గుట్కా, గుడంబా పట్ల ఆకర్షితులు కారాదని, అపరిచితుల నుంచి వాహనాలు కొనుగోలు చేయరాదని అన్నారు. సెల్‌ఫోన్‌తో ఉపయోగాలు ఎన్ని ఉన్నాయో అనర్థాలు కూడా అంతేనని అన్నారు. ఆధార్, పాన్, ఓటీపీలను చెప్పొద్దని తెలిపారు.

మహిళలకు ఆర్థిక చేయూత



ప్రారంభ వేడుకల్లో ఏసీ పింకేష్ కుమార్

జనగామ: మహిళలను ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. జనగామ మున్సిపాలిటీలో మెప్మా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి మహిళా వ్యాపార సేవా దుకాణ సముదాయాన్ని ఏసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు సమష్టి భాగస్వామ్యంతో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా కష్టపడి పని చేసినప్పుడే కుటుంబ సంక్షేమం, ప్రజలకు సేవ చేసే భాగ్యం మనందరికీ కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ హర్షవర్ధన్, జిల్లా కో ఆర్డినేటర్ రమేష్ నాయక్, జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ వాణిశ్రీ, టౌన్ కో ఆర్డినేటర్ రాజేందర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు షాహిన్ సుల్తానా, తిరుమల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జఫర్‌గఢ్ : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీకాంత్,. పీఈటీలు

జఫర్‌గఢ్ : స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుకుంటున్న డి.అరవింద్, కె.విక్రమ్, కె.హన్సిక, ఎస్.స్పందనలు ఇటీవల జిల్లాలోని చాగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 3 నుంచి 5 వరకు సంగారెడ్డి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీలు బి.రాజు, ఏ.శ్రీనాథ్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో శివునిపల్లి విద్యార్థిని ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని భూక్య దీపిక ఈనెల 29న హనుమకొండలో జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్–2024 పోటీల్లో పాల్గొని కటాస్ విభాగంలో ఉత్తమ ప్రతిభతో సిల్వర్ మెడల్ సాధించింది. హెచ్‌ఎం కె.రమేష్ సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఇటీవల జరిగిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభతో పాఠశాలకు చెందిన ఎల్.నితిన్, బి.దీపిక, జి.శ్రీవాణి, ఎస్‌కే ఆదిల్ కబడ్డీలో, జి.అక్షిత, జి.అంకిత, స్పందన, ప్రసన్న, రాంచరణ్, జగన్ ఖోఖోలో, మణికంఠ, రుత్విక్, నాని, చరణ్ వాలీబాల్‌లో జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం.రమేష్, పీడీ కొండ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

కులాంతర వివాహ జంటకు రక్షణ కల్పించాలి



పాలకుర్తి టౌన్: కులాంతర వివాహం చేసుకున్న జంటకు రక్షణ కల్పించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాకు వినతిపత్రం అందజేసి వివాహం వివరాలు తెలిపారు. ఇటీవల పాలకుర్తి మండలం కోతులబాధ గ్రామానికి చెందిన చిట్యాల సతీష్(రజక), ఏనుగు రేవతి రెడ్డి(రెడ్డి) హనుమకొండలో వివా హం చేసుకున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు మై లారం వెంకటేశ్వర్లు, ఏదునూరి మదార్, వీరనా రి ఐలమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు చిట్యాల మంజుల తెలిపారు. ఈ వివాహాన్ని సహించని అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయిని బెదిరిస్తూ కుటుంబ స భ్యుల ఇంటి మీదికి పోతున్నారని, వారికి రక్షణ క ల్పించాలని కోరారు. ఈ జంటకు రూ.10 లక్షలు ఆ ర్థికసాయం అందించి ఉపాధి కల్పించాలన్నారు. బాధిత అబ్బాయి తల్లిదండ్రులు నర్సమ్మ, అక్క రాధిక, కుమారస్వామి,మానస, సబిత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు అండగా పీఏసీఎస్

నర్మెట: రైతులకు అండగా ప్రాథమిక వ్యవసాయ కేంద్రం పనిచేస్తుందని చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి అన్నారు. పీఏసీఎస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు 1877 రైతులకు రూ. 14.60 కోట్ల పంటరుణాలు అందజేసినట్లు, 1822 మందికిగాను 1056 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. కాగా 50 మంది రైతులకు బంగారు రుణాలు రూ. 56 లక్షలు ఇచ్చామని, డీ కేటగిరిలో ఉన్న సంఘాన్ని ఏ కేటగిరీకి తెచ్చామని అన్నారు. ప్రస్తుత పాలక వర్గం హయాంలోనే రైతులకు న్యాయం జరిగిందని అన్నారు.

'తిరుపతి లడ్డూ వివాదంపై విచారణ జరిపించాలి'

జనగామ రూరల్: తిరుపతి లడ్డూ వివాదంపై విచారణ జరిపించాలని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్



జనగామ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని 15 రోజుల పాటు జరిగే సేవా పక్షంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బాణాపురంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మూర్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో పాలకుర్తి రోడ్డు వైపు రెండోవార్డు ఏరియాలో రైల్వేగూడ్స్ షెడ్ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఘన్‌పూర్ సీఐ జి.వేణు కథనం ప్రకారం.. మృతుడు దాదాపు 50 సంవత్సరాల వయస్సు ఉంటాడని, ఈనెల 29న ఉరేసుకుని ఉంటాడని తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి సోమవారం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ తెలిపారు. మృతుడు భుజంపై టవల్ వేసుకుని ఉన్నాడని, పచ్చరంగు లుంగీ, తెలుపు, పాలపిట్ట రంగు గీతల ఫుల్‌షర్టు వేసుకుని ఉన్నట్లు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేస్తున్నామని, ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

తరిగొప్పుల: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వాచ్యావెంకట్‌తండా శివారు నాన్యనాయక్‌తండాకు చెందిన భూక్య హర్య(65) వ్యక్తిగత పనుల నిమిత్తం తన టీవీఎస్ ఎక్సెల్‌పై మండలకేంద్రానికి చేరుకున్నాడు. బస్టాండ్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని మలుపు తిప్పుతుండగా హుస్నాబాద్ నుంచి జనగామ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భూక్య హర్య రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రున్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కానుకుంట్ల లక్ష్మణ్ అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజలపై భారం మోపడం సరికాదు

బచ్చన్నపేట: దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి ప్రజలపై భారం మోపడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ అ బ్బాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చిన్నరాంచర్ల సీపీఎం గ్రామ 8వ మహాసభ శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను అబ్బాస్ ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ మోదీ అధికారంలో ఉన్నంత కాలం అంబానీ, అదానీలే అభివృద్ధి చెందుతారని తెలిపారు.

లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలి

కొడకండ్ల : మండలకేంద్రంలోని వ్యాపారస్తులు షాపుల లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మహేష్‌చౌహాన్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని షాపులను ఆయన సందర్శించి లైసెన్స్‌లను పరిశీలించారు. లైసెన్స్ తీసుకోని వ్యాపారస్తులు లైసెన్స్‌లు పొందాలన్నారు.

దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలించిన ఇరిగేషన్ చీఫ్



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఎస్‌సీ

చిల్పూరు: మండలంలోని రాజవరం సమీపంలోని దేవాదుల పంప్‌హౌస్‌ను సోమవారం సాయంత్రం ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) అనిల్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవాదుల ఫేజ్ –3 పనుల్లో భాగంగా ప్యాకేజీ–3 ,4 పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చేయాలని ఆదేశించారు. ముందుగా పంప్‌హౌజ్ టన్నెల్ అప్రోచ్ చాలెన్లకు సంబంధించి చేపడుతున్న పనుల విధానాన్ని అధికారులు, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాతో పాటు సూర్యాపేట, భువనగిరి, వరంగల్ రైతాంగానికి సాగునీరు అందించడంలో భాగంగా ప్యాకేజీ 3, 4లో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించడం జరిగిందని త్వరలోనే రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట అధికారులు రామకృష్ణ, యాసర్, సుధీర్ బాబు, శేషగిరి, అశోక్ పాల్గొన్నారు.